క్లుప్తంగా

శ్రీమఠంలో ప్రత్యేక పూజలు



మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆశీస్సులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మూలబృందావనంకు నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం బెంగళూరు నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. దేశం నలుమూల నుంచి తరలి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంకాలం ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథోత్సవాలపై ఊరేగించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా శ్రీమఠంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

దర్గాలో అమావాస్య పూజలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాల్లో ఒకటైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో శనివారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. కొంతమంది భక్తులు పిండి వంటలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు తెల్లవారుజామున 5 గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్గాలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, నాయకులు

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జి.భీమారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని 52–బసాపురం గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖర్, సర్వేయర్ అబ్దుల్ వహిద్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామస్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం పలు సంక్షేమ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. పలు అంశాలకు సంబంధించి తీర్మానాలు చేశారు. రైతులు పాల్గొన్నారు.

కోలుకోలేక వివాహిత మృతి

ఆదోనిఅర్బన్: మండలంలోని చిన్నపెండేకల్ గ్రామానికి చెందిన శివలింగమ్మ (27) కుటుంబ కలహాలతో శుక్రవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. శివలింగమ్మ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందింది. మృతురాలికి భర్త వీరేష్, ఒక కుమార్తె సంతానం. గత ఆరు సంవత్సరాల క్రితం వివాహమయ్యింది. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఇంట్లోనే ఎలుకల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపిన వివరాల మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైకులు ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. క్రాంతినగర్ కాలనీకి చెందిన గోపాల్, పంజరాపోల్ కాలనీకి చెందిన అంకిత్ ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలపై వస్తూ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం వైద్యులు ఇద్దరినీ కర్నూలుకు రెఫర్ చేశారు. ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి శరన్నవరాత్రోత్సవాలు

ఆదోనిఅర్బన్: దసరా పండుగ సందర్భంగా శరన్నవ రాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి పట్టణంలో అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. పట్టణంలో ఆయా వీధుల్లో అమ్మవార్లు మండపాల్లో కొలువుదీరనున్నారు. అమ్మవారి వివిధ రూపాల విగ్రహాలను మండప నిర్వాహకులు, ఇతర రాష్ట్రాలు, ప్రదేశాల నుంచి తీసుకొచ్చి ఆదివారం ప్రతిష్ఠించి పూజలు చేసేందుకు సిద్ధంగా ఉంచారు. అంతేగాకుండా మండపాలను వివిధ రకాల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంతేగాకుండా అమ్మవార్లకు ప్రతిరోజూ ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం వేళ 9 రోజులపాటు 9 రూపాల్లో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

తూకంలో మోసం

- ఆదోని యార్డులో మూలనపడిన బ్రిడ్జి కాటాలు
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- బయట కాటాలు, కొన్ని ఫ్యాక్టరీలలో తూకాలు వేయిస్తూ వ్యాపారుల మోసం
- నష్టపోతున్న పత్తి రైతులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం



మార్కెట్‌యార్డులో నిరుపయోగంగా మారిన వేబ్రిడ్జి కాటా

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో వేబ్రిడ్జి కాటాలు మూలనపడడం వ్యాపారులకు వరంగా మారింది. దిగుబడిని అమ్ముకుందామని వచ్చిన రైతులను కొంతమంది వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. పత్తి దిగుబడులను వ్యాపారులు తమ గోదాములు, లేదా తమకు అనుకూలంగా ఉన్న బయట కాటాలలో తూకాలు వేయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యార్డులో పత్తి సగటు ధర క్వింటా రూ.7450కు పైగా పలుకుతోంది. ఇటు ధర లేక తూకాల్లో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు రాష్ట్రంలోని అత్యంత ప్రాధాన్యత గల యార్డులలో ఒకటి. ప్రతిరోజు రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి రైతులు యార్డుకు వేల క్వింటాళ్ల పత్తి అమ్మకానికి తెస్తారు. ప్రస్తుతం ప్రతిరోజూ ఐదు వేల క్వింటాళ్ల వరకు దిగుబడులు అమ్మకానికి వస్తున్నాయి. సీజన్‌లో అయితే ప్రతిరోజూ 30 వేల క్వింటాళ్ల వరకు క్రయవిక్రయాలు జరుగుతాయి. ఖర్చు తగ్గించుకునే క్రమంలో రైతులు చాలామంది పత్తి చెక్కులకు స్వస్తి పలికి ట్రాక్టర్లు, లారీలు, ట్రాలీ ఆటోల్లో నింపుకొని వచ్చి యార్డు, ఫ్యాక్టరీలలో అమ్ముకుంటున్నారు. తెచ్చిన పత్తి దిగుబడిని కమీషన్ ఏజెంట్ల వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ కాటాల ద్వారా తూకాలు వేయడం సాధ్యం కాదు. నేరుగా ఫ్యాక్టరీలకు వెళ్లినా, యార్డుకు తెచ్చినా, కొనుగోలు చేసిన కొంతమంది వ్యాపారులు వాహనాలను తమ గోదాముల బయట కొత్త కాటాలలో తూకాలు వేయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు.

మోసాలు ఇలా..!

కొనుగోలు చేసిన వాహనాల్లో లూజు పత్తిని వ్యాపారస్తులు వారి ఫ్యాక్టరీలలో వేబ్రిడ్జి కాటా వేస్తారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని తూకాలు తక్కువగా చూపించే విధంగా వేబ్రిడ్జి కాటాను ఏర్పాటు చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆటోలో ఉన్న పత్తిని కాటా వేస్తే 30 కేజీల నుంచి 40 కేజీల వరకు, మినీ లారీ 40 కేజీల నుంచి 60 కేజీల వరకు, బొలెరోకు 60 నుంచి 80 కేజీల వరకు, ఐచర్ లారీలకు దాదాపు 2 క్వింటాళ్లలోపు వరకు వేబ్రిడ్జిలో తూకాలు తక్కువగా చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. మోసం జరుగుతోందని తెలిసినా గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం రైతులకు లేకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. గత సంవత్సరం బసాపురం, ఆలూరు రోడ్లలో ఉన్న ఫ్యాక్టరీలలో జరిగిన తూకాల మోసం తెలిసిందే. బయట రైతులు ముందుగానే తూకాలు వేయించుకోవడం వల్లే వ్యాపారుల అక్రమాలు బయటపడ్డాయి. అంతేగాకుండా కొన్ని ఫ్యాక్టరీలలో తక్కువ ధర వేస్తే రైతు మరలా ధర ఎక్కువ కావాలి, లేకపోతే ఇవ్వనంటే ఆ వ్యాపారి ధర ఎక్కువ వేసి చీటీలో వారి కోడ్ ద్వారా సిగ్నల్ పెట్టి కాటాకు పంపుతారు. ముందుగానే కోడ్ ద్వారా సిగ్నల్ తెలిసిన కాటాదారుడు కొన్ని కేజీలను సాంకేతిక పరిజ్ఞానంతో తీసి కాటా వేసి మోసం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మరమ్మతులకు నోచుకోని యార్డులోని వేబ్రిడ్జి కాటా

మోసాలు అరికట్టడం ఎలా అంటే...?

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో లూజు పత్తి వాహనాలు రోజుకు 40 నుంచి 60 వాహనాలు వస్తుంటాయి. నేరుగా ఫ్యాక్టరీలకు వందకు పైగానే వెళ్తాయి. యార్డులో ఉన్న వేబ్రిడ్జి కాటాలలో తూకాలు నిర్వహిస్తే వ్యాపారుల మోసాలకు అడ్డుకట్ట పడుతుంది. అయితే ఏళ్ల గడుస్తున్నా అధికారులు వేబ్రిడ్జిలకు మరమ్మతులు చేయించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యార్డులో వేబ్రిడ్జి కాటాకు మరమ్మతులు చేసి, యార్డులో కొనుగోలు అయిన లూజు పత్తి వాహనాలు యార్డులోనే కాటా వేసుకునేలా నిబంధన పెడితే ఇటు రైతు మోసపోకుండా ఉండడమే గాకుండా యార్డుకు రోజుకు వేలల్లో ఆదాయం వస్తుంది. అంతేగాకుండా బయట నేరుగా వెళ్లే లూజు పత్తి వాహనాలను ఇక్కడే కాటా వేసుకుంటే రైతులు నష్టపోకుండా ఉంటారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టి వేబ్రిడ్జి కాటాలను మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు.



రైతులు వాహనంలో లూజు పత్తిని తీసుకొచ్చిన దృశ్యం

మోసాలకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేస్తాం



రైతులు లారీలు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలలో యార్డుకు తెచ్చిన పత్తి దిగుబడుల తూకాల్లో వ్యాపారులు మోసం చేస్తే వారి లైసెన్సు రద్దు చేస్తాం. తూకాల్లో మోసం జరిగితే కఠిన చర్యలు ఉంటాయి. యార్డులోని వేబ్రిడ్జిల మరమ్మతులు కూడా త్వరలోనే చేపడతాం. ఇందుకు సంబంధించి త్వరలోనే ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి అంచనాలు తయారు చేసి జిల్లా అధికారులకు నివేదిస్తాం. రైతులు పత్తి దిగుబడులను చెక్కులుగా తీసుకువస్తే తూకాలు యార్డు అధికారుల పర్యవేక్షణలో జరుగుతాయి. రైతులు పత్తి దిగుబడులను బొరల్స్‌లోనే తీసుకురావాలి. దీంతో మోసాలకు చెక్ పెట్టవచ్చు. – రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు సెక్రటరీ

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

ఆదోని సెంట్రల్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎస్టీయూ సీనియర్ నాయకులు తిమ్మప్ప తెలిపారు. శనివారం ఎస్టీయూ భవనంలో డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పదోన్నతుల వల్ల ప్రాథమిక పాఠశాలల్లో అనేక ఖాళీలు ఏర్పడినట్లు తెలిపారు. దీని వల్ల ప్రాథమిక స్థాయి విద్య కుంటుపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప మాట్లాడుతూ..ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించుకోరాదని కోరారు. ఎస్టీయూ నాయకులు వి.శ్రీనివాసులు, కాశీవిశ్వనాథ్ శాస్త్రి, హనుమన్న, శ్రీనివాసులు, జ్యోతిమూర్తి, రామ్మోహనరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను ఆదుకోవాలి

కోసిగి: పారిశుద్ధ్య కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ సెన్నా ఓబులేశు కోరారు. శనివారం కోసిగి బాలుర ఉన్నత పాఠశాల నుంచి పురవీధుల గుండా సఫాయి కర్మచారిలు ర్యాలీ చేపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేటికి మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో సఫాయి కర్మచారిలచే సామూహిక మరుగు దొడ్లు, మురుగు కాల్వలు శుభ్రం చేయిస్తున్నారన్నారు. మనుషులచే అలాంటి పనులు చేయించరాదని అత్యున్నత న్యాయస్థానం చెప్పినప్పటికీ అలాంటి పనులు చేయిస్తున్నారన్నారు. అయినా వారికి చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరి చేయించి వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జిల్లా సఫాయి కర్మచారి ఆందోళన కన్వీనర్ నారాయణ స్వామి, కార్యకర్తలు రాజేంద్ర, ఈరన్న, కుంటి ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం



స్వామివారి దర్శనం కోసం క్యూలో వస్తున్న భక్తులు,



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి మూలవిరాట్

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో సందడిగా నెలకొంది. శనివారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు. రెండవ శనివారం సెలవు రోజుతో పాటు అమావాస్య కలిసి రావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో పోటెత్తాయి. స్వామి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులను విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ మార్గాల ద్వారా దర్శనానికి పంపారు. పిండి వంటలు వండి స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోలవారు ప్రత్యేక బస్సులను నడిపారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

- అలాగే ఉరుకుందకు ఐదు కిలోమీటర్ల దూరంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అమావాస్య కావడంతో భక్తుల సందడి నెలకొంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆంజనేయ స్వామిని దర్శనానికి కూడా తరలిరావడంతో ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.
- తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో అధికంగా కర్ణాటక భక్తులు కూడా తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

హనుమాన్‌కు ప్రత్యేక పూజలు





ప్రత్యేక అలంకరణలో రణమండల ఆంజనేయ స్వామి, తులసీమాలలో మంగరాయ ఆంజనేయ స్వామి

ఆదోనిఅర్బన్: అమావాస్య సందర్భంగా శనివారం పట్టణంలో శివ, శైవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన ఆంజనేయ స్వామికి ఆలయ నిర్వాహకుడు పాండురంగయ్య శెట్టి ఆధ్వర్యంలో పూజారి ఆనంద ఆచారి ఫలపంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, నైవేద్యం, మహామంగళహారతితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలసిన ఆంజనేయ స్వామికి ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో పూజారి గురురాజ ఆచారి, అక్షయకుమార్ తులసీమాలతో అలంకరించారు. ముందుగా ఫల పంచామృతాభిషేకం, తేనాభిషేకం, తులసీ అలంకారం, నైవేద్యం, మహా మంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: మండల కేంద్రంలోని బసవన్న కొండపై వెలసిన బసవేశ్వర స్వామికి శనివారం అమావాస్య పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి వేకువజాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని నారికేళాలు సమర్పించి పూజలు చేశారు. భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

కోసిగి కడపాలెం వీధిలో వెలసిన ఆంజనేయ స్వామికి విశేష పూజలు చేపట్టారు. శనివారం వేకువ జామున నుంచి ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజలు , మహా మంగళ హారుతుల గావించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వేలాది మంది తరలి వచ్చి స్వామివారికి నారికేళాలు సమర్పించి పూజలు చేశారు.

ఓపెన్ ఇంటర్ తరగతులు ప్రారంభం

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్మీడియట్ తరగతులను శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఓపెన్ ఇంటర్ కో–ఆర్డినేటర్ వి.సంజన్న ప్రారంభించారు. వారు మాట్లాడుతూ చదువుకోవాలని ఆసక్తి ఉండి అనివార్యకారణాల వల్ల విద్యకు దూరమైన వారికి ఇది మంచి అవకాశమన్నారు. సార్వత్రిక విద్యాపీఠం అందిస్తున్న ఓపెన్ ఇంటర్‌లో చదువు పూర్తి చేసుకున్న వారు రెగ్యూలర్ ఇంటర్మీడియెట్ కోర్సుతో సమానమని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్ కంప్లీట్ చేసుకుని డిగ్రీలో నేరుగా జాయిన్ కావడానికి అవకాశం ఉందని వివరించారు. ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తులను కోరగా హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో 40 మంది విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో 30 మంది విద్యార్థులు చేరినట్లు తెలిపారు. నెలలో రెండవ శనివారం, ఆదివారాలలో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలు నేరుగా విద్యార్థి ఇంటికే పంపుతారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తరగతులకు హాజరై మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రోగ్రాం అధికారి గోవిందరాజులు, అధ్యాపకులు శివయ్య, ఈరన్న ,రాజేశ్వరి, బడేసాహెబ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల అతిక్రమణపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తూ, విద్యా శాఖ నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలలు, పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, బాలు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో తరగతులు నిర్వహిస్తున్న అక్షరశ్రీ, జ్యోతిర్మయి, శ్రీచైతన్య, నారాయణ కళాశాలలకు వెళ్లి బంద్ చేయించారు. వారు మాట్లాడుతూ.. నీట్, ఎంసెట్ కోచింగ్ పేర్లను చెప్పి విద్యార్థులను మానసికంగా హింసిస్తున్నారని వాపోయారు. అదనపు కోచింగ్‌లు, క్లాసుల పేర్లతో వేలకు వేలు దండుకుటున్నారని మండిపడ్డారు. సెలవురోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఆయా పాఠశాలలపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు విష్ణునాయుడు, హరికృష్ణ, మహేశ్, హోసన్నా, రాజు, గణేష్, వీరంజి, చంద్ర, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాదాకలి ఉరుసు



నెరణికి గ్రామ వీధుల్లో గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి గ్రామంలో వెలసిన సాదాకలి తాత ఉరుసులో భాగంగా శనివారం తెల్లవారుజామున గంధం, ఆ తర్వాత ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాలను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తాత సమాధిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున గంధం పురవీధుల గుండా ఊరేగింపుగా దర్గాకు చేరడంతో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేశారు. బుధవారం జియారత్ కార్యక్రమంతో సాదాకలి ఉరుసు వేడుకలు ముగుస్తాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

భూకబ్జాపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో దళిత వ్యక్తికి చెందిన భూమిని కబ్జా చేసిన గొల్ల హనుమంతుపై చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమరేష్, తాలుకా ప్రధాన కార్యదర్శి సుమాల చార్లెస్ కోరారు. శనివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హరిజన చిన్న హనుమంతు భూమిని కబ్జా చేసిన గొల్ల హనుమంతుపై ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 139 లో 0.79 ఎకరం భూమి హరిజన హనుమంతు పేరిట ఉందని తెలిపారు. అయితే అదే గ్రామానికి చెందిన గొల్ల హనుమంతు దళితుడిని నమ్మించి నీకు పంట నష్ట పరిహారం తెప్పిస్తానని చెప్పి పాస్‌బుక్ తీసుకొని ఎమ్మిగనూరుకు చెందిన వ్యక్తికి విక్రయించినట్లు చెప్పారు. మద్యం తాగించి దళితుడితో రిజిస్ట్రార్ కార్యాలయంలో సంతకం పెట్టించుకున్నారని తెలిపారు. మోసం చేసి దళితుడి భూమిని విక్రయించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సారా, అక్రమ మద్యంపై నిఘా

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన మాళ మల్లేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా నాటుసారా, అక్రమ మద్యం కట్టడి చేసేందుకు పటిష్ట నిఘా ఉంచినట్లు ఆలూరు సెబ్ సీఐ ఎర్రవెంకట్ తెలిపారు. ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న గట్టు ఉత్సవాల్లో నాటుసారాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు సివిల్, సెబ్ పోలీసులతో ఉమ్మడిగా దాడులు నిర్వహిస్తామన్నారు. సరిహద్దు ప్రాంతంలో 6 చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. అలాగే విజయవాడ నుంచి 20 మంది మొబైల్ టీంను నియమించినట్లు చెప్పారు. సారా, అక్రమ మద్యం, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై 94409 02577 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు మెరుగైన బోధన

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ దోహదపడాలని విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి సూచించారు. శనివారం మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పీఎంసీ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు డిజిటల్ బోధనలో భాగంగా నవోదయ సమితి నుంచి 11, 12వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్స్ ఇచ్చినట్లు చెప్పారు. విజ్ఞాన్ జ్యోతి కార్యక్రమంలో భాగంగా నీట్, జేఈఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్యాబ్స్ ద్వారా విద్యార్థులు దక్షణ/జేఈఈ/ నీట్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ కావటానికి మెటీరియల్ పొందుపరిచినట్లు వివరించారు. విద్యార్థుల నైపుణ్యానికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన సాగించాలని సూచించారు. ఈ సంవత్సరం విద్యాలయ హైదరాబాద్ రీజియన్‌లో బోర్డ్స్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా బోధన ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు భరోసా



సీఎం రిలీఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: పేద ప్రజలకు ఆరోగ్యపరంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నారని, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించడమేగాకుండా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రజల్లో ధైర్యం నింపుతున్నారని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో.. మండలంలోని సుల్తానపురం గ్రామానికి చెందిన ఈడిగ లక్ష్మికి రూ.20 వేలు, ఆదోని పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన బెస్త వరలక్ష్మికి రూ.50 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద విడుదలైన చెక్కులను అందజేశారు. సుల్తానపురం సర్పంచ్ వీరేష్, శేషిరెడ్డి పాల్గొన్నారు.


తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోర్లు వేయిస్తున్న పంచాయతీ ఈఓ చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకుడు రాజేష్

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని పులికనుమ రిజర్వాయర్ దిగవ భాగాన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో ఎమ్మెల్యే నిధులతో మరో రెండు కొత్త బోర్లు వేయించినట్లు పంచాయతీ ఈఓ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజేష్ తెలిపారు. శనివారం పులికనుమ రిజర్వాయర్ సమీపంలో గ్రామ సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో రెండు ప్రాంతాలలో రెండు బోర్లు వేయించారు. రెండు బోర్లలో మూడించుల మేర నీళ్లు పడినట్లు తెలిపారు. పదిహేను రోజుల క్రితం రూ.18 లక్షలతో ఎమ్మెల్యే చేతుల మీదుగా పైప్‌లైన్ పనులు, తాగునీటి బోర్లకు భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు బోర్లు వేయించగా, ప్రస్తుతం రంగప్ప గట్టు వద్ద నుంచి నాడుగేని వీధి వరకు పైప్‌లైన్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పనులు పూర్తయితే పుష్కలంగా మంచి నీరు సరఫరా కానుంది. రంగప్ప గట్టు, చైతన్య స్కూల్, నాడుగేని వీధి, మైనార్టీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, గాంధీ నగర్ తదితర కాలనీ వాసులు తాగునీటి సరఫరా చేయిస్తున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



కొత్తపేట కొండల్లో సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

హొళగుంద: మండల పరిధిలోని కొత్తపేట, అరికెర కొండల్లో శనివారం ఆలూరు సివిల్, సెబ్ సీఐలు వెంకటేశ్వర్లు, ఎర్ర వెంకట్ ఆధ్వర్యంలో హొళగుంద, ఆలూరు, ఆస్పరి ఎస్ఐలు శ్రీనివాసులుతో పాటు సిబ్బంది నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీ స్థావరాలను గుర్తించి బిందెల్లో నిల్వ ఉంచిన 450 లీటర్ల బెల్లం ఊటను, బిందెలను ధ్వంసం చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 15 లీటర్ల నాటుసారా, 256 కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 24న దేవరగట్టు బన్ని ఉత్సవం పురస్కరించుకుని కొండల్లో పెద్ద ఎత్తున సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం నుంచి కొండల్లో గాలించి స్థావరాలను ధ్వంసం చేశారు.

'బన్ని' ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలి

హొళగుంద: దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం నెరణికి తండా గ్రామంలో ఉత్సవాల నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 24న జరిగే బన్ని ఉత్సవాలకు రింగు కర్రలు తీసుకెళ్లడం, మద్యం సేవించి ఉత్సవంలో గుంపులుగా పాల్గొనడం మంచి సాంప్రదాయం కాదన్నారు. విగ్రహాల ఊరేగింపులో అగ్గి కాగడాలను భక్తులపై విసరడం, అల్లర్లకు దిగడం లాంటి పనులు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సంప్రదాయ పద్ధతిలో భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలన్నారు. అలాగే నాటుసారా, మద్యం అమ్మకాలపై పూర్తి నిఘా పెట్టామని, అల్లర్లకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.